నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 22 జనవరి 2024 | SURYAPET

## ఇంటర్ తర్వాత ఏం చదువాలి?

నేడు 'లక్ష్యం' -2024' పేరిట అవగాహన సదస్సు

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహణ

రామగిరి, జనవరి 21 : ఇంటర్మీడియట్ తర్వాత ఏ కోర్సులు చదువాలి, ఎటు వైపు వెళ్తే జీవితంలో స్థిరపడి ఉత్తమ ఉద్యోగం చేయవచ్చు అనే అంశంపై నమస్తే తెలంగాణ, తెలంగాణ టు డే, కేఎల్ యూనివర్సిటీ సంయుక్తంగా 'లక్ష్యం' – 2024' పేరుతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రగతి బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం 11గంటలకు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా కేఎల్ యూనివర్సిటీ అధికారులు, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే బాధ్యులు హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఇంటర్ సెకండియర్ చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




## నేడు 'నల్లగొండ'పై బీఆర్ఎస్ సమీక్ష

- తెలంగాణ భవన్‌కు గులాబీ సేన
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశా నిర్దేశం
- తరలివెళ్లనున్న ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు

నల్లగొండ ప్రతినిధి, జనవరి21(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలపై భారత రాష్ట్ర సమితి పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ఇప్పటికే ఈ నెల 12వ తేదీన భువనగిరి స్థానంపై సమీక్ష పూర్తి కాగా నేడు నల్లగొండ లోక్‌సభ స్థానంపైన రివ్యూ మీటింగ్ జరుగనున్నది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వేదికగా జరిగే ఈ సమీక్ష సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా దిశానిర్దేశం చేయనున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తూనే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనే ప్రధానంగా చర్చించనున్నారు. సోమవారం నాటి సమీక్ష సమావేశంలో నల్లగొండ లోక్‌సభ పరిధిలోని ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులంతా తరలివెళ్లనున్నారు.

### నియోజకవర్గానికి 100 మంది చొప్పున

నేడు జరిగే సమావేశానికి ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సగటున 100 మంది చొప్పున మొత్తం ఏడు స్థానాల నుంచి 700 మంది వరకు పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌తోపాటు లోక్‌సభ స్థానం పరిధిలోని జిల్లా పార్టీల అధ్యక్షులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లా కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు, మండల స్థాయి ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ముఖ్యులతో మాట్లాడించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై పోస్టుమార్టం చేస్తూ లోక్‌సభ ఎన్నికల సన్నద్ధంపైనే ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిసింది. కాగా నల్లగొండ లోక్‌సభ స్థానం పరిధిలో నల్లగొండ, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం సూర్యాపేటలో మాత్రమే బీఆర్ఎస్ పార్టీ గెలుపొందగా మిగతా ఆరు చోట్ల కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇక ఇదే సమయంలో 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండలో స్వల్ప తేడాతో కాంగ్రెస్ గెలుపొందింది. అయినా సరే నల్లగొండ లోక్‌సభ స్థానంపైన ఈ సారి గులాబీ జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో ఎన్నికలకు సిద్ధం కానున్నది. అందులో భాగంగానే నేడు జరుగనున్న సమావేశంలో యువనేత కేటీఆర్ ఓవర్ ఆల్‌గా అన్ని అంశాలను క్రోడీకరిస్తూ దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# పల్లె ప్రగతి కొనసాగేనా?

- కేసీఆర్ సర్కారు హయాంలో రూపురేఖలు మారిన పల్లెలు
- పచ్చదనం, పరిశుభ్రతకు నెలనెలా నిధులు
- జిల్లాకు 51 నెలల్లో రూ.362 కోట్లు విడుదల
- కొత్త ప్రభుత్వ తీరుతో పల్లె ప్రగతి నిధులపై నీలి నీడలు




సూర్యాపేట, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : స్వరాష్ట్రంలో పల్లెలు పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం సత్ఫలితాలిచ్చింది. నెలనెలా నిధులు ఇవ్వడంతో పల్లెల్లో మురుగు వాసన లేదు.. గుంతల రోడ్లు పోయాయి. వీధులు, రోడ్లకు ఇరువైపులా పచ్చని తోరణంలా మొక్కలు.. ఊరికో పల్లె ప్రకృతి వనం, మండలానికో మెగా ప్రకృతి వనంతో పచ్చదనం ఉట్టిపడుతున్నది. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి డంప్ యార్డులకు తరలించడంతో గ్రామాలు పరిశుభ్రంగా మారాయి. వీటికితోడు గ్రామపంచాయతీ అవసరాలకు ట్రాక్టర్, నాటిన మొక్కలకు నీళ్లు పోసేందుకు ట్యాంకర్లు కొనుగోలు చేశారు. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీలకు 2019 సెప్టెంబర్ నుంచి 2023 నవంబర్ వరకు రూ.362 కోట్లు విడుదలయ్యాయి. అయితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లె ప్రగతి కార్యక్రమం కొనసాగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ఖజానా ఖాళీ అంటుండడం పట్ల పల్లె ప్రగతికి నిధుల విడుదలపై నీలి నీడలు అలుముకుంటున్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో ఏ ఊరికి పోయినా మురుగు నీటి గుంతలు.. అందులోనే మంచినీటి నల్లాలు.. వీధు ల్లో చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు.. పాడు బడిన బావులు దర్శనమిచ్చేది. కూలిన ఇండ్లు.. రోడ్లపైకి వచ్చే మురుగు నీటితో దోమలు, ఈగలు, ఇతర కీటకాలతో జనం అనారోగ్యం పాలయ్యేది. స్వరాష్ట్రంలో కేసీఆర్ పదేండ్ల పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా మారాయి. దేశంలోనే ఎక్కడా లేని విధంగా చేపట్టిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల రూపు రేఖలను సమూలంగా మార్చేశాయి. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగింది. నాడు ఊర్లల్లో ఏదైనా పని చేయాలంటే నయా పైసా ఉండకపోయేది. కానీ.. స్వరాష్ట్రంలో పదేండ్లుగా ప్రతి పంచాయతీకి నెల నెలా రూ.13 నుంచి రూ.8కోట్ల వరకు అందాయి. 2019 సెప్టెంబర్ నుంచి 2023 నవంబర్ వరకు 475 పంచాయతీలకు రూ.362 కోట్లు విడుదలయ్యాయి. స్టేట్ ఫైనాన్స్ నుంచి రాష్ట్రానికి ప్రతి నెలా రూ.339 కోట్లు విడుదల కాగా, అన్ని జిల్లాలకు జనాభా ప్రాతిపదికన ఇచ్చారు.



నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామంలో పల్లెప్రగతిలో భాగంగా నిర్మించిన పల్లెప్రకృతి వనం (ఫైల్)

### ప్రశ్నార్థకంగా పల్లె ప్రగతి కొనసాగింపు..

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లె ప్రగతి కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలతో పాటు ప్రధాన అంశాల్లో పల్లె ప్రగతి కొనసాగింపుపై స్పష్టత లేదు. ఇప్పటికే యాసంగి సాగు సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో పల్లె ప్రగతికి నిధులు ఇస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం పల్లె ప్రగతి నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, డంప్ యార్డులు, శ్మశాన వాటికలు నిర్మించడంతోపాటు ట్రాక్టర్లు, ట్యాంకర్లు సమకూర్చగా మళ్లీ నెలనెలా నిధులు వస్తే పల్లెలు మరింత సౌభాగ్యంగా మారనున్నాయి. మరి రేవంత్ ప్రభుత్వం నిధులు ఇస్తుందో.. లేదో వేచి చూడాలి.


కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, జనవరి 21 : రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు నిధులు అందజేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాల్వపల్లితండా, కొత్తదొనబండ తండాలో ఉపాధిహామీ నిధులు రూ.76లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ పాఠశాలలు, లాలితండాలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే గ్రామ పంచాయతీలకు సీసీ, ప్రహరీ నిర్మాణాలకు రూ.15లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అమరవరం లిఫ్ట్ మరమ్మతులను 15రోజుల్లో చేయిస్తామని, హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ముడావత్ పార్వతి, తాసీల్దార్ మంగా రాథోడ్, ఎంపీడీఓ జానకిరాములు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకట్‌రెడ్డి, డీఎస్పీ ప్రకాశ్ యాదవ్, సర్పంచులు మాలోతు సుజాత, బాణోతు విజయ, బాణోతు బోడి, మంజూనాయక్, సాముల శివారెడ్డి, ఎల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పిండిప్రోలు రామచంద్రయ్య, సినీ నిర్మాత బండ్ల గణేశ్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, పక్కన బీఆర్ఎస్ నాయకులు

## దళితురాలిననే నాపై అవిశ్వాసం

- ప్రతిపక్ష నేతల కుట్రలో కౌన్సిలర్లు పావులుగా మారొద్దు
- సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

బొడ్రాయిబజార్, జనవరి 21 : దళిత మహిళను అయినందునే ప్రతిపక్షాలు తనపై అవిశ్వాస దాడి చేస్తున్నాయని, అందులో కౌన్సిలర్లు పావులు కావొద్దని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే రాజకీయాలకు వచ్చానని.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఆశీస్సులతో చైర్‌పర్సన్ పదవి వచ్చిందని అన్నారు. తనను చైర్‌పర్సన్‌గా బలపరిచిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో సూర్యాపేట పట్టణ సమగ్రాభివృద్ధికి విశేష కృషి చేశానని, కరోనా సమయంలో కూడా సేవలు అందించానని తెలిపారు. నాలుగేండ్లలో అవిశ్వాసం మాట తెలియదని, దళిత మహిళను అయినందునే తనపై అక్కసుతో ప్రతిపక్షాలు అవిశ్వాస దాడి చేస్తున్నాయని ఆరోపించారు. దళిత మహిళపై పెట్టిన అవిశ్వాసంతో దామోదర్‌రెడ్డి, సంకినేని, రమేశ్‌రెడ్డి చరిత్ర హీనులుగా మారనున్నారని అన్నారు. అక్కా.. అంటే అర్ధరాత్రి కూడా పలికి పని చేశానని, దళితురాలినని పదవి నుంచి దించడం న్యాయమా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుల రాజకీయ కుట్రలో కౌన్సిలర్లు పావులుగా మారొద్దని.. తప్పుడు మాటలు, దుష్ప్రచారం నమ్మి ఆగం కావద్దని సూచించారు. సమస్యలు ఉంటే మాట్లాడి పరిష్కరించుకుందామని, పట్టణ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, నాయకులు చొక్కయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

## ప్రతిభను గుర్తించి పురస్కారాలు అందజేయడం హర్షణీయం

- ఏపీ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి
- ఘనంగా పుడమి సాహితీ వేదిక వార్షికోత్సవం

రామగిరి, జనవరి 21 : భాషకు ఎల్లలు, ప్రాంతాలు లేవు.. ఆ దిశగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి సేవా పురస్కారాలు అందజేయడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. నల్లగొండలోని పెన్షనర్స్ భవన్‌లో పుడమి సాహితీ వేదిక తెలంగాణ 5వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా లక్ష్మీపార్వతి హాజరై మాట్లాడారు. పాలకులు సాహిత్య విలువలు పాటిస్తూ తెలుగును, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి మాట్లాడుతూ వేదిక 5వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 10 రంగాలకు చెందిన 60మందిని గుర్తించి పుడమిరత్న విశిష్ట సేవా పురస్కారాలు అందజేశామన్నారు. అందులో తెలంగాణకు చెందిన వారు 35, ఏపీ వాళ్లు 25 మంది ఉన్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పలు కోచింగ్ సెంటర్లలో బోధిస్తూ ఎందరో నిరుద్యోగులు ప్రభుత్వ కొలువులు సాధించేలా శిక్షణ అందించిన నల్లగొండ బీఈడీ కళాశాల సీనియర్ అధ్యాపకుడు వలిశెట్టి యాదగిరిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుత్తా మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పుడమి సాహితీ వేదిక సభ్యులు పాల్గొన్నారు.


వలిశెట్టి యాదగిరికి ఉత్తమ అధ్యాపకుడిగా విశిష్ట సేవా పురస్కారం అందజేస్తున్న ఏపీ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, పుడమి సాహితీ వేదిక సభ్యులు

## సీఎంను కలిసిన ప్రవాస భారతీయుడు మట్టారెడ్డి

నిడమనూరు, జనవరి 21 : లండన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని నిడమనూరు మండలంలోని వల్లభాపురం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్ డమ్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వంటెద్దు మట్టారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సెంట్రల్ లండన్ పరిధిలోని షార్డ్ ఐకానిక్ హోటల్‌లో బస చేసిన సీఎంను కలిసి తెలంగాణలో ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం బిగ్ బెన్ టవర్ క్లాక్ జ్ఞాపికను సీఎంకు బహూకరించారు.


లండన్‌లో సీఎం రేవంత్ రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మట్టారెడ్డి

## గురుకులాల దరఖాస్తుకు ఈ నెల 23 వరకు గడువు

నల్లగొండ, జనవరి 21 : ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు జనరల్ ఇంగ్లిష్ మీడియం గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకు పొడిగించినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ రీజినల్ కో ఆర్డినేటర్ హెచ్.అరుణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో 100 రూపాయల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి 2న ఎంపిక చేయబడిన ఆయా కేంద్రాల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఊరికి కీడొచ్చిందని..

- వనభోజనాలకు వెళ్లిన పార్వతీపురం గ్రామస్తులు
- జ్వరాలకు పారిశుధ్యలోపమే కారణమంటున్న వైద్య సిబ్బంది

నిడమనూరు, జనవరి 21 : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతూ ప్రపంచాన్నే అరచేతిలోకి అందుబాటులోకి తెచ్చినా మూఢ నమ్మకాలు మాత్రం ప్రజల జీవితంపై ఆధిపత్యం చేస్తూనే ఉన్నాయి. గ్రామంలో విష జ్వరాలు ప్రబలగా.. ఊరికి కీడొచ్చిందని భావించిన ఆ గ్రామస్తులంతా తెల్లవారుజామునే ఇల్లు వదిలి వన భోజనాలకు వెళ్లారు. గ్రామం చుట్టూ పొత్తి పోసి రాకపోకలను నిలిపివేశారు. ఈ సంఘటన నిడమనూరు మండలం పార్వతీపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పార్వతీపురం గ్రామంలో నెల రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రతి ఇంట్లో ఒకరిద్దరు అనారోగ్యం బారిన పడ్డారు. గ్రామాన్ని సందర్శించిన వైద్యారోగ్య శాఖ సిబ్బంది డెంగీ లక్షణాలను గుర్తించారు. ఇళ్లల్లో నీరు నిల్వ ఉండటం, లార్వా వ్యాప్తి చెందడం వంటి కారణాలే విషజ్వరాల తీవ్రతకు కారణమని నిర్ధారించారు. ఇవేమీ పట్టించుకోని గ్రామ పెద్దలు మిర్యాలగూడలో శివసత్తులను ఆశ్రయించారు. ఊరికి కీడొచ్చింది.. ఊరు వదలాలని శివసత్తులు చెప్పడంతో శనివారం అర్ధరాత్రి గ్రామస్తులంతా పార్వతీపురం చుట్టూ పొత్తి పోసి రహదారికి అడ్డుగా కంప వేసి గ్రామానికి రాకపోకలను నిలిపివేశారు. తెల్లవారుజామున 5 గంటలకు గ్రామస్తులంతా కుటుంబంతో కలిసి ఇండ్లను వదిలి గ్రామ శివార్లలో వన భోజనాలకు వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం తిరిగి గ్రామంలోకి వచ్చారు. ఈ విషయమై సర్పంచ్ వంకా బ్రహ్మన్నను వివరణ కోరగా.. నెల రోజులుగా తీవ్ర జ్వరాల నేపథ్యంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. విష జ్వరాల నివారణకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శివసత్తులు చెప్పిన కొలుపుతో గ్రామస్తుల కోరిక మేరకు కొన్ని గంటల పాటు ఊరు వదిలినట్లు తెలిపారు.


తెల్లవారుజామున వనభోజనాలకు వెళ్తున్న గ్రామస్తులు

## ఫిబ్రవరి 19 నుంచి పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు

- వచ్చే నెల 15నుంచి 18వరకు అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట, జనవరి 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం (పాతగుట్ట) వార్షిక బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 19 నుంచి 25 వరకు అత్యంత వైభవంగా చేపడుతున్నట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఫిబ్రవరి 15 నుంచి 18వరకు ఆలయంలో అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 19 సోమవారం మాఘ శుద్ధ మాసం నుంచి 25వ తేదీ మాఘ బహుళ పాడ్యమి వరకు 2024 వార్షిక బ్రహ్మోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా పాతగుట్టలో భక్తులతో జరిపించే నిత్య కల్యాణం, హోమాలు రద్దు చేస్తున్నట్లు వివరించారు. ఫిబ్రవరి 22న రాత్రి 8గంటలకు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం జరుగుతుందని, ఇందులో భక్తులందరూ పాల్గొనేందుకు వీలుగా కల్యాణ టికెట్టు రూ.600 నిర్ణయించామని తెలిపారు. ఫిబ్రవరి 24న రాత్రి 8 గంటలకు దివ్య విమాన రథోత్సవాన్ని పాతగుట్ట ఆలయం ముందు భాగం నుంచి స్వామి వారి కల్యాణ మండపం వరకు ఊరేగిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 25న స్వామివారి అష్టోత్తర శతఘటాభిషేకంతో ఉత్సవాలు పరిపూర్ణం అవుతాయని వెల్లడించారు.

### నాలుగు రోజుల పాటు ఆధ్యయనోత్సవాలు

| తేదీ | ఉదయం | సాయంత్రం/ రాత్రి |
|---|---|---|
| ఫిబ్రవరి 15న | తిరుమంజనం | తొళక్కం |
| ఫిబ్రవరి 16న | పురప్పాట్ సేవ, తిరుమంజనం | పురప్పాట్ సేవ, దివ్య ప్రబంధ సేవాకాలం |
| ఫిబ్రవరి 17న | పురప్పాట్ సేవ | పరమపద ఉత్సవం |
| ఫిబ్రవరి 18న | నూత్తందారి చాత్మరా | ....... |
| **వార్షిక బ్రహ్మోత్సవాల్లో జరిగే కార్యక్రమాలు** | | |
| ఫిబ్రవరి 19న | 10 గంటలకు స్వస్తీవాచనం, విశ్వక్సేనారాధన | 6 గంటలకు మృత్సంగ్రహణం, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, |
| **అంకురారోపణం** | | |
| ఫిబ్రవరి 20న | 10 గంటలకు ధ్వజారోహణం, హోమం, వేద పారాయణం | 6 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం |
| ఫిబ్రవరి 21న | 10 గంటలకు హవనం, సింహవాహన అలంకార సేవ | 6 గంటలకు హోమం, |
| **అశ్వవాహన అలంకార సేవ స్వామివారి ఎదుర్కోలు** | | |
| ఫిబ్రవరి 22న | 10 గంటలకు తిరుమంజనోత్సవం, హనుమంత వాహనం | 6 గంటలకు హవనం<br>రాత్రి 8 గంటలకు గజవాహన సేవ స్వామివారి |
| **తిరుకల్యాణ మహోత్సవం** | | |
| ఫిబ్రవరి 23న | 10 గంటలకు గరుఢ వాహన అలంకార సేవ | సాయంత్రం 6 గంటలకు రథాంగ హోమం,<br>రాత్రి 8 గంటలకు దివ్య విమాన రథోత్సవం |
| ఫిబ్రవరి 24న | 10 గంటలకు మహా పూర్ణాహుతి<br>మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థం, శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, డోలారోహణం | 6 గంటలకు దేవతా ఉద్వాసన, |
| ఫిబ్రవరి 25న | 10 గంటలకు స్వామివారి అష్టోత్తర శతఘటాభిషేకం,<br>మధ్యాహ్నం 12:30 గంటలకు మహదాశీర్వచనం, పండిత సన్మానం, ఉత్సవ సమాప్తి | |

## ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

భువనగిరి సిటీ, జనవరి 21 : 56వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా పురుషుల, మహిళల జట్లను భువనగిరి జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు జనవరి 25 నుంచి ఫిబ్రవరి 8 వరకు సాయికృప కళాశాల క్యాంపస్‌లో కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి తెలిపారు. కోచింగ్ క్యాంపునకు 20 మంది మహిళలు, 20 మంది పురుషులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి 9నుంచి 11 వరకు జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఖోఖో సంఘం ఉపాధ్యక్షుడు పి.రమేశ్‌రెడ్డి, కోశాధికారి ఎ.విజయ్, జాయింట్ సెక్రటరీ కె.మురళి, ఆర్గనైజ్ సెక్రటరీలు పి.ఆంజనేయులు, పి.శ్రీశైలం, జి.బాలకృష్ణ, సురేందర్, కోచ్ స్వాతి, పీఈటీలు బి.కేశనాగులు, నాగేంద్ర, వెంకట్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రీడాకారులు